క్లుప్తంగా

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : జిల్లాలోని బీడి కార్మికులు 1 నుంచి 10వ తరగతి చదువుకునే తమ పిల్లలకు సంబంధించి ఉపకార వేతనాల కై దరఖాస్తు చేసుకోవాలని కమలాపురం బీడి కార్మిక సంక్షేమ సంఘం ఆసుపత్రి వైద్యులు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర కార్మిక ఉపాధి శాఖ కింద పనిచేస్తున్న బీడి కార్మికుల పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు విడుదల చేసిందన్నారు. 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

రేపటి నుంచి విరాట పర్వ పఠనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటరమణస్వామి ఆలయంలో గురువారం నుంచి నెల రోజులపాటు విరాట పర్వ పఠనం నిర్వహిస్తున్నట్లు శ్రీమద్భగవద్గీత ధర్మ ప్రచార సమితి, ఆలయ కమిటీ వారు తెలిపారు. మంగళవారం వారు తెలుపుతూ ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు విరాట పర్వ పఠనాన్ని పలువురు వక్తలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థులకు రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు సుబ్బిరెడ్డి మంగళవారం విద్యార్థులకు పలకలు, పెన్నులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదల పిల్లలకు పుస్తకాల కిట్‌లు పంపిణీ చేయడం ప్రతి ఒక్కరు తమ సమాజ సేవగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సర్వేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే పంపిణీ చేయాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ రేషన్ డీలర్లకు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65ఏళ్లు నిండిన వృద్ధులు, బెడ్ రీడర్స్, వికలాంగులకు ప్రతి నెలా 26వ తేదీ నుండి 30వ తేదీలోపు ముందుగానే సచివాలయ సిబ్బందితో కలిసి రేషన్ సరుకులను ఇంటి వద్దనే అందించాలన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

జమ్మలమడుగు : విద్యార్థులు చదువుకునే వయసులో మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జూనియర్ కాలేజి విద్యార్థులకు మత్తు పదార్థాల, ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చాలా మంది సెల్‌ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఫోన్‌లో ఉన్న యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారని తద్వారా జరిగే అనార్థలు కుటుంబాలను రోడ్డున పడేస్తాయన్నారు. ప్రస్తుతం ఎక్కువ మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు అవుతున్నారన్నారు. ఎక్కడైనా ఈవ్‌టీజింగ్ వంటివి జరిగితే వెంటనే 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ గోపికృష్ణ, డాక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతులు పాటించండి

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే రైతులు పంటల మార్పిడి పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ సంచాలకులు వి.వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం తిమ్మాపురం, నేదరపేట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసేటప్పుడు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రామంజులరెడ్డి, ఎఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

మందుబాబుల హల్ చల్



క్రీడా మైదానంలో బీర్ బాటిళ్లతో ఘర్షణ పడుతున్న యువకులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో మందు బాబులు ఃమంగళవారం బీర్ బాటిళ్లతో ఘర్షణ పడ్డారు. మందుబాబులు ప్రతిరోజు మద్యం బాటిళ్లు తెచ్చుకుని మైదానంలో తాగి అక్కడే బాటిళ్లను పగులగొట్టి వెళ్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం క్రికెట్ ఆడుతూ మైదానంలో బీర్ బాటిళ్లతో ఘర్షణకు దిగారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పోలీసులకు ఈ విషయం తెలపక పోవడం ఏంటని స్థానికులు చెబుతున్నారు.

• మురుగునీటితో అవస్థలు..



మురుగునీటిలో నడుస్తున్న చిన్నారులు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పులివెందుల టౌన్ : పట్టణంలోని సియోన్‌పురం ఫైర్‌స్టేషన్ సమీపంలోని ఒక వీధిలో రోడ్డుపై మురుగునీరు పారుతుంది. దీంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపై పారుతున్నా మున్సిపల్ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆప్రాంత ప్రజలు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు మురుగునీటిలోనే నడవాల్సి వస్తుంది. దీనికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతుందని ఆప్రాంత ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి మురుగునీటిని రోడ్లపై పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నడవాలంటే అంతా మురుగునీరే



రోడ్డుపై నడవాలంటే అంతా మురుగునీరే ఉంది. నిత్యం నడవాలంటే ఇబ్బందులు పడుతున్నాము. ఎవరూ పట్టించుకోవడంలేదు. వాసన వస్తుంది. దోమలు బాగా పెరిగిపోయాయి. ఇలా అయితే ఎలా ఉండాలి. అధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపై పారకుండా శుభ్రం చేయించాలి.

- సుమలత, స్థానికురాలు, పులివెందుల

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పుట్లంపల్లె, మీరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, మినుము పంటలపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసే రైతులు ముందుగా భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. భూసార పరీక్షల వలన తగిన మోతాదులో ఎరువులు వాడవచ్చని, తద్వారా సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రైతులు వాడే రసాయనిక ఎరువులలో ముఖ్యంగా నూటి ఎరువుల మీద పూర్తిగా ఆధారపడి సాగు చేయడం వల్ల నేలలో సూక్ష్మ పోషకాల పరిమాణం క్రమంగా క్షీణిస్తున్నాయని తెలియజేశారు. సూక్ష్మ పోషకాల లోప లక్షణాలు పంటపై కనిపించక ముందే దిగుబడిని తగ్గిస్తాయన్నారు. పంటలు ఎదగడానికి అభివృద్ధి మంచి ఉత్పత్తి కోసం మొక్కలకు అవసరమైన అన్ని పోషకాలను సమతుల్యంగా అందించాలన్నారు. సూక్ష్మ పోషకాలైన జింకు, ఇనుము, బోరాన్ లోపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటం వలన సూక్ష్మ పోషక లోపం తగ్గుతాయన్నారు. వరి నాటునప్పుడు నారు కొనలు తుంచి నాటాలని సూచించారు. ప్రతి రెండు మీటర్లకు 30 సెం.మీ. దూరం కాలిబాటలు తీసుకోవాలన్నారు. మేలైన రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. పీఎం కిసాన్ కొరకు లింక్ లేని వారు బ్యాంకులకు వెళ్లి ఎన్‌సీపీఐ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఇందిరా, శివ రంజని, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో చతికిల పడిన కూటమి ప్రభుత్వం

వేంపల్లె : కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకుపోతోందని, అభివృద్ధిలో మాత్రం చతికిలపడిందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమికి డబుల్ ఇంజన్ సర్కార్ దూసుకుపోతోందని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2023-24లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రూ.34,698 కోట్లు కాగా 2024-25లో రూ. 20,135 కోట్లు మాత్రమే వచ్చిందని, కూటమి ప్రభుత్వ పాలనలో గ్రాంట్ రూ.14,563 కోట్లు తగ్గిందని, సంజీవిని లాంటి ప్రత్యేక హోదా రాలేదని, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రాలేదన్నారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం కూడా కాలేదన్నారు. దుగ్గ రాజపట్నం ఓడ రేవు నిర్మాణం కాలేదని, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్ ఇవ్వకుండా అప్పు తెచ్చుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2023-24 కంటే 2024-25లో మూల ధన వ్యయం రూ.4,413 కోట్లు తగ్గిందని, ఒక్క ఏడాదిలోనే రూ1,58,604 కోట్ల అప్పు చేసి ఇది ఆల్ టైమ్ రికార్డు కొట్టిందన్నారు. కూటమి విజయోత్సవ సభలో తొక్కి నార తీస్తాం లాంటి వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడడం అనుచితమన్నారు. కొడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది పవన్ మాటల తీరు ఉందన్నారు. ఇకనైనా పవన్ తన మాట తీరు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

నాటు సారా అమ్మితే ప్రభుత్వ పథకాలు వర్తించవు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి

పులివెందుల రూరల్ : నాటుసారా అమ్మితే ప్రభుత్వ పథకాలు వర్తించవని ఎక్సైజ్ శాఖ సీఐలు చెన్నారెడ్డి, విశ్వనాథ్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని రామాలయం సమీపంలో నాటుసారా విక్రయాలు జరిపే వ్యాపారస్తులతో నవోదయం-2 ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై సహకరించాలన్నారు. అలాగే తహసీల్దార్ నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ నాటు సారా తయారు చేసేవారు ఇప్పటినుంచైనా వాటిని మానుకొని తమ పిల్లలను శ్రద్ధగా చదివించుకుని మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. అర్బన్ సీఐ చాంద్ బాషా మాట్లాడుతూ గతంలో నగరిగుట్ట నాటుసారాకు మారుపేరుగా ఉండేదని, ప్రస్తుతం నాటు సారా చాలా వరకు అరికట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సాధిక్ హుస్సేన్, రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో రసంపీల్చే పురుగులను నివారించండి



గొల్లల గూడూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

వేముల : పత్తిలో రసంపీల్చే పురుగులను నివారించుకోవాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని గొల్లలగూడూరు, పెర్నపాడు గ్రామాల్లో మంగళవారం పత్తి, ఉల్లి పంటలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి, ఉల్లి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉన్నట్లయితే, పత్తి పంటలో గులాభి రంగు పురుగు, రసం పీల్చే పురుగులను నివారించడానికి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పత్తిలో మెగ్నీషియం లోపం నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ పిచికారి చేయాలన్నారు. ముఖ్యంగా వేరుకుళ్లు తెగులు గుర్తించి దీని నివారణకు కార్బండిజం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఉల్లి పంటలో కూడా తెగుళ్ల ఉదృతి ఎక్కువగా ఉంటుందని, సకాలంలో మందులను పిచికారి చేసి సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీఏఏ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ ముగ్గురాయి తవ్వకాల పరిశీలన



అక్రమంగా ముగ్గురాయి తొవ్వుతున్న కూలీలతో మాట్లాడుతున్న మైనింగ్ అధికారులు



అక్రమంగా నిల్వ ఉంచిన ముగ్గురాయి

పెండ్లిమర్రి : మండలంలోని నాగాయపల్లె గ్రామ సమీపంలోని తుమ్మలూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 874లో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని మంగళవారం మైనింగ్ అండ్ జియాలజీ రీజనల్ విజిలెన్స్ ఏడీ బాలసుబ్రమణ్యం, ఏజీ కృష్ణమూర్తిలు పరిశీలించారు. నాగాయపల్లె సమీపంలో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్తులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి స్థానిక వీఆర్వోను పిలుచుకొని వచ్చారు. అప్పటికే అక్రమార్కులు కూలీలచే అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు చేపడుతున్నారు. వారిని చూసి కూలీలు తవ్వకాలు చేపట్టకుండా బయటకు వచ్చారు. అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలకు చేపడితే కేసులు నమోదు చేస్తామని కూలీలను హెచ్చరించారు. సర్వే నంబర్ 874 ఆర్ఎస్ఆర్ ప్రకారం ఫారెస్టు భూమిగా ఉండటంతో మైనింగ్ అధికారులు నిల్వ ఉన్న ముగ్గురాయిని సీజ్ చేయకుండా ఫారెస్టు అధికారులకు నివేదిస్తామని వెళ్లిపోయారు.

టేకు రథానికి శాశ్వత మండపం ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : నారాపురస్వామి ఆలయంలో ప్రతి పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. శ్రీవారి సేవా సమతి ఆధ్వర్యంలో టేకు రథాన్ని బహుకరించడం జరిగింది. ప్రస్తుతం ఆ రథం ఉంచటానికి సరైన మండపం లేకపోవడంతో ఎండకు, వానకు తడుస్తూ దెబ్బతింటోంది. సరైన భద్రతకోసం ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేయాలని శ్రీవారి సేవా సమితి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి సుధాకర్‌గుప్త ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

రక్తదానం ప్రాణదానం

పులివెందుల రూరల్ : రక్తదానం చేయడంవల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లవుతుందని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్యామలరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఎస్‌బీఐ మేనేజర్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్యామలరావు, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్, రాజేశ్వరిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఎస్‌బీఐ ఉద్యోగులు, సిబ్బందిని వారు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సమాచారం అందించాలి

జమ్మలమడుగు రూరల్ : ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీస్‌లకు ముందస్తుగా సమాచారం ఇస్తే వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు మండలంలోని శేషారెడ్డిపల్లిలో సీఐ సిబ్బందితో కలసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఏమైన సమస్యలు వస్తే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. అలాగే సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

సొంత మండలంలో పనిచేసుకోనివ్వండి

కొండాపురం : సొంత మండలంలో పనిచేయకూడదు అనే నిబంధనను రద్దుచేసి సొంత మండలంలో ఎక్కడైనా పనిచేసుకునే వీలును కల్పించాలని గ్రామ సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వారు ప్లకార్డులతో ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీఓ నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జీవో నెంబర్ 5ను సవరించి వార్డ్ ఉద్యోగుల మాదిరి గ్రామసచివాలయ ఉద్యోగులకు కూడా సొంత మండలంలో పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. క్యాడర్ వారిగా సీనియారిటీ జాబితా విడుదల చేసి మెరిట్ ప్రాతిపదికన బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలకు కోరుకునే ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియలో మిగులు ఉద్యోగుల భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగుల కెరీర్ అభివృద్ధికి దోహదపడేలా సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌తో ప్రమోషన్ చానల్ కల్పించాలన్నారు. రెండు సంవత్సరాల ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రధానం



వల్లూరు : మండలంలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్న భీమచెర్ల దీపకు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకురాలుగా వున్న ఆమె ' ఏ స్టడీ ఆన్ ఆటిట్యూడ్ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్ టువర్డ్స్ కంటిన్యూస్ అండ్ కాంప్రెహెన్సివ్ ఎవాల్యూషన్ ఇన్ రాయలసీమ రీజియన్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీ రాజ మాణిక్యం తెలిపారు. ఈమె విద్యా విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో తన పరిశోధన గ్రంథం పూర్తి చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎరగ్రుంట్లకు చెందిన ఈమె ఎస్జీటీగా, పీజీటీ గా, ప్రిన్సిపాల్ గా వివిధ స్థాయిలో విధులను నిర్వర్తించారు. డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురాం

వల్లూరు : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల కలిసి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యా శాఖ అధికారులు వెంకటేశాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని గోటూరు పాఠశాలకు కలిపారని, కనీసం ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కూడా కల్పించక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గోటూరు ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు పాఠశాలకు హాజరు కావడం కష్టంగా మారుతోందని, దీని వలన తల్లికి వందనం లబ్ధి అందకపోయే అవకాశం వుందని విద్యాశాఖ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. 108 వాహనాలకు సరైన పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గతంలో తమ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ఇంకుడు గుంతలు మంజూరు చేయగా నిర్మించుకున్నారని, ప్రస్తుతం వాటిని వినియోగించుకోకుండా వీధుల్లోకి బాత్‌రూమ్‌ల నీరు వదులుతుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంబవరం గ్రామ సర్పంచ్ ఓబుల్ తెలిపారు. ఇంకుడు గుంతలు మంజూరైన లబ్ధిదారుల జాబితా అధారంగా వాటిని ఉపయోగించుకుని మురుగు నీరు వీధుల్లోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి మోటారు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించి బదిలీలు చేయాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

వేంపల్లె : పదోన్నతులు కల్పించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు కృష్ణారెడ్డి, కొత్తూరు కిరణ్‌లు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 5ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ధర్నా చేపట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఎంపీడీఓ కుళాయమ్మకు, తహసీల్దార్ హరినాథరెడ్డిలకు సచివాలయ ఉద్యోగులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ, రోస్టర్ జాబితా మేరకు ప్రమోషన్స్ కల్పించిన తర్వాతనే బదిలీలు చేయాలని కోరారు. బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీఓ 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమెండ్ చేసి విద్యార్హతను బట్టి ఉద్యోగన్నతులు కల్పించాలని కోరారు. అలాగే అందరికీ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరయ్యే విధంగా చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డు అసిస్టెంట్ పే స్కేల్‌ను జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌గా వర్తింపజేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా స్పష్టత ఇవ్వకపోతే ఉద్యోగులు పెన్-డౌన్, సమ్మె వంటి శాంతియుత నిరసన చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు సెక్రటరీలు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

పులివెందుల రూరల్ : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయమని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అచ్చివెళ్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేడీఏ పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రతి పథకం లబ్ధి పొందేలా అవగాహన కల్పించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి నగదు బిల్లు పొంది భద్రపరుచుకోవాలన్నారు. అలాగే ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది పంట సాగు చేయాలని సూచించారు. కంది పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా కందుల మినీ కిట్స్ అందిస్తోందన్నారు. అనంతరం రైతులకు కంది పంట సాగు చేసే రైతులకు కందుల మినీ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వేతనాలు పంపిణీ



పంచాయతీ సిబ్బందికి జీతాలను పంపిణీ చేస్తున్న డీఎల్‌పీఓ రమాదేవి

వేంపల్లె : వేంపల్లె గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య, వాటర్ స్కీం సిబ్బందికి వేతనాలు పంపిణీ చేసినట్లు పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న గత 5 నెలల వేతనాలకు సంబంధించి రూ.41లక్షల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మార్చి నెల నుంచి గ్రామ పంచాయతీకి ఈఓ లేకపోవడంతో పారిశుధ్యం, వాటర్ స్కీం సిబ్బందికి జీతాలు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో మైలవరం మండలంలోని వేపరాల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మాధవరెడ్డికి గ్రేడ్-1గా పదోన్నతి కల్పించి వేంపల్లె ఈఓగా నియమించడం జరిగిందన్నారు. పారిశుధ్యం కార్మికులకు 5 నెలలు జీతాలను, వాటర్ స్కీం సిబ్బందికి 3 నెలల జీతాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వేంపల్లెలో పారిశుధ్యం పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. అయా ప్రాంతాల్లో అపరిశుభ్రత అనేది ఉంటే వెంటనే పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



రైతులకు మినీ కిట్లను పంపిణీ చేస్తున్న జేడీఏ, తదితరులు

లింగాల : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జేడీఏ చంద్రా నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెలిదండ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేడీఏ చంద్రానాయక్ హాజరై మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేయడంవల్ల ఖర్చులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు అందుతాయన్నారు. అలాగే లింగాల మండలానికి ఒక వ్యవాసయ డ్రోన్‌ను పంపిణీ చేశామని, దాని ద్వారా మందులను పిచికారి చేసుకుంటే సమయం ఆదా అవుతుందన్నారు. చీడ, పీడల నివారణకు బాగా సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జింక్, జిప్సం, బోరాన్ వంటి వాటిని సబ్సిడీతో అందిస్తామని, కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం వారు కంది, మినుము పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం కందులు, మినుమలు మినీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీనారాయణ

కమలాపురం : విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని కమలాపురం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక తూర్పు గండ్లూరు ఎస్టీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ సహకారంతో దాతలు ఇచ్చిన విద్యా సామాగ్రిని ఆయన విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద పిల్లలే ఉంటారని, వారికి ఇలా సహకారం అందించడం హర్షణీయం అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఇలా విద్యా సామగ్రి పంపిణీ చేస్తే విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందన్నారు. జూటూరు విజయ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో మంచి చదువులు అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసారాన్ని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలి

వీరపునాయునిపల్లె : భూసారాన్ని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన పొలం సిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడులు రాకపోవడానికి ప్రధాన కారణం భూసారం తగ్గిపోవడమేనన్నారు. వేపచెక్క, ఆముదం చెక్క, పశువు పేడ, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం లాంటివి ఉపయోగించాలని రైతులకు సూచించారు. అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యవంతమైన పంటలు పండించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాంమాంజులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.